## చిన్నారిని అభినందించిన జిల్లా కలెక్టర్



చిన్నారిని అభినందిస్తున్న కలెక్టర్ ఓ.ఆనంద్

**తాడిపత్రిటౌన్, నవంబర్ 25 ప్రభాతవార్త**

తాడిపత్రి పట్టణానికి చెందిన చిన్నారి యశస్వి భారతీ కేవలం 6.9 సెకన్లలో తలతో వరుసగా 100 ట్యూబ్ లైట్లు పగులగొట్టి ప్రపంచ రికార్డును సృష్టించింది. ఈ రికార్డు సాధించడంపై జిల్లా కలెక్టర్ ఒ.ఆనంద్ యశస్వికి అభినందనలు తెలుపుతూ, అయాన్ తైక్వాండో అకాడమీకి శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో ఇంకా మంచి రికార్డులు నెలకొల్పి మన జిల్లాకు ఆంధ్రప్రదేశ్‌కు మంచి పేరు తేవాలని అలాగే క్రీడాకారిణి యశస్విని భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయిలో ఒలింపిక్స్‌లో భారత్ తరుపున ప్రాతినిథ్యం వహించే విధంగా శిక్షణ పొంది ఇంకా రికార్డులు నెలకొల్పి ప్రత్యేక గుర్తింపు పొందాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ అండ్ రికార్డు మెంటర్ శివయ్య, అయాన్ తైక్వాండో అకాడమీ కోచ్ సాయి పాల్గొన్నారు.

## బొప్పేపల్లి చెరువుకు నీరు విడుదల



నీటిని విడుదల చేస్తున్న దృశ్యం

**పుట్లూరు, నవంబర్ 25 ప్రభాతవార్త**

పుట్లూరు మండలంలోని సంజీవపురం గ్రామ సమీపంలో వున్న సుబ్బరాయసాగర్ నుండి 29వ డిస్ట్రిబ్యూటరీ ద్వారా యల్లనూరు మండలంలోని బొప్పేపల్లి చెరువుకు మంగళవారం హెచ్ఎల్‌సి అధికారులు నీటిని విడుదల చేశారు. ఈ నెల 13న పుట్లూరు చెరువుకు నీటిని విడుదల చేసిన విషయం విధితమే. కాగా సుబ్బరాయసాగర్ గేట్లు పూర్తి స్థాయిలో పైకి లేవకుండా ఉండడంతో ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఆదేశాల మేరకు హెచ్ఎల్‌సి అధికారులు హోస్పేట్ నుండి ప్రత్యేక నిపుణులను రప్పించి ప్రయత్నం చేశారు. కానీ గేట్లు పైకి లేవక పోవడంతో అధికారులు, రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కాగా నీరు వృధా అవుతున్న నేపథ్యంలో బొప్పేపల్లి చెరువుకు నీటిని విడుదల చేసినట్లు సమాచారం. కాగా పుట్లూరు, కోమటికుంట్ల, గరుగుచింతలపల్లి చెరువులకు నీటి విడుదల ప్రశ్నార్థకంగా మారింది. ఈ ఏడాది ముందస్తుగా నీటిని విడుదల చేసినప్పటికి మండలంలోని చెరువులకు నీరు చేరకపోవడంపై రైతన్నలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## పాము కాటుతో యువరైతు మృతి

**పుట్లూరు, నవంబర్ 25 ప్రభాతవార్త**



పాముకాటుతో మృతి చెందిన ఎలగాని ప్రతాపుడు

పాము కాటుతో యువరైతు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకొంది. వివరాల్లోకి వెళితే మండలంలోని చింతకుంట గ్రామానికి చెందిన ఎలగాని ప్రతాపుడు (29) అనే రైతు తన పొలంలో పని నిమిత్తం మంగళవారం ఉదయమే వెళ్లారు. కాగా పొలంలో పనులు చేస్తుండగా కాలికి ఏదో గుచ్చుకొన్నట్లు తీవ్రంగా నొప్పి ఉండడతో ఏదో విషపురుగు కుట్టినట్లు గమనించి, వెంటనే ఇంటికి చేరుకున్నాడు. అప్పటికే తీవ్రంగా ఒళ్ళంతా చెమటలు పట్టి చాతీ భాగంలో తీవ్రంగా నొప్పితో తన ఇంటిలో పడిపోయాడు. గమనించిన కుటుంబసభ్యులు తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా ఆసుపత్రికి చేరుకునేలోపే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఎస్ఐ సురేష్ ఆసుపత్రికి చేరుకొని జరిగిన సంఘటనపై వివరాలు తెలుసుకొని, మృతుని భార్య శరణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## నేడు శ్రీసుబ్రహ్మణ్య షష్టి వేడుకలు

**తాడిపత్రిటౌన్, నవంబర్ 25 ప్రభాతవార్త**



తాడిపత్రి పట్టణంలోని వడ్లపాలెంలో వెలసిన శ్రీకాళికాదేవి దేవస్థానంలో బుధవారం ఉదయం శ్రీసుబ్రహ్మణ్య షష్టి వేడుకలను అర్చకులు వీరబ్రహ్మం ఆచార్యులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించనున్నారు. మార్గశిర మాసం శుక్లపక్షంలో వచ్చు సుబ్రహ్మణ్య షష్టి అత్యంత శక్తివంతమైన తిథి కావునా శ్రీసుబ్రహ్మణ్యస్వామికి పంచామృత అభిషేకం, సుగంధ ద్రవ్య జలంతో అభిషేకము, పుష్పార్చన, ప్రసాద నివేదన, మహా మంగళహారతి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సుబ్రహ్మణ్య షష్టి రోజున సుబ్రహ్మణ్యస్వామిని ఆరాధించడం వలన ప్రేమ, ఆరోగ్యం, ఉద్యోగం, వ్యాపారం, కుటుంబ సమస్యలు, భార్యాభర్తల సమస్యలు, సంతాన సమస్యలు, రాజకీయపరమైన సమస్యలు, స్త్రీ పురుష వియోగం వంటి సమస్యలు తీరడంతో పాటు ధనలాభం కొరకు విశేష ఫలితాలు పొందుతారన్నారు. కావున భక్తాదులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని శ్రీసుబ్రహ్మణ్యస్వామి కృపకు పాత్రులు కావాలని అర్చకులు తెలిపారు. పూజలో పాల్గొనే వారు 9989434797కు సంప్రదించాలని ఆయన తెలియచేశారు.

## రైతుల సమస్యల పరిష్కారం కోసం రైతన్న మీకోసం



రైతులకు సూచనలు ఇస్తున్న దృశ్యం

**పుట్లూరు, నవంబర్ 25 ప్రభాతవార్త**

రైతుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం అన్ని రైతు సేవా కేంద్రాల్లో రైతన్న మీకోసం కార్యక్రమాన్ని చేపడుతోందని వ్యవసాయ సహాయ సంచాలకులు రవి పేర్కొన్నారు. మంగళవారం అరకటవేముల గ్రామంలో వ్యవసాయశాఖ అధికారులు రైతుల ఇళ్ల వద్దకు వెళ్లి ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలను వివరించి, రైతన్నలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకుని పరిష్కార మార్గాలను సూచించారు. మండల ఏఒ కాత్యాయని మాట్లాడుతూ రైతన్నల కోసం ఈ కార్యక్రమం ఈ నెల 29వతేదీ వరకు కొనసాగుతుందన్నారు. డిసెంబర్ 3వతేదీన రైతు సేవా కేంద్రాల పరిధిలోని రైతుల కోసం గ్రామ సభలు నిర్వహించడం జరుగుతుందని ఏఒ తెలియచేశారు. ఈ కార్యక్రమంలో విహెచ్ఎ రష్మిక, రైతులు పాల్గొన్నారు.

## ఇమామ్, మూజన్లకు గౌరవ వేతనం.. చంద్రబాబుకు పాలాభిషేకం..

**నల్లచెరువు నవంబర్ 25 ప్రభాతవార్త**



సీఎం చిత్రపటానికి పాలాభిషేకానికి హాజరైన ముస్లిం సోదరులు

ముస్లిం మతగురువుల సంక్షేమం పట్ల ప్రభుత్వం చూపుతున్న కట్టుబాటును మరోసారి చాటుతూ ఇమామ్‌లు,మూజన్లకు గౌరవ వేతనాల కోసం ప్రభుత్వం గణనీయమైన నిధులను విడుదల చేయడం పట్ల రాష్ట్రవ్యాప్తంగా ముస్లిం మైనార్టీ సోదరులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం నల్లచెరువు మండల కేంద్రంలోని మండల వ్యాప్తంగా ఉన్న ముస్లిం మైనార్టీ సోదరులు స్థానిక బస్టాండ్ కూడలి నందు సమావేశమై రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని వేలాది మసీదుల్లో సేవలందిస్తున్న ఇమామ్‌లు, మూజన్లకు మాటిచ్చినట్టుగానే గౌరవ వేతనాలు సమయానికి అందేలా చర్యలు తీసుకోవడం పట్ల ముస్లిం మైనారిటీ తరపున ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి కృతజ్ఞతలు తెలిపారు. ఇమామ్‌లు, మూజన్ల కోసం తీసుకున్న ఈ నిర్ణయం మైనారిటీల పట్ల చంద్రబాబు ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని వారు పేర్కొన్నారు. ఇమామ్‌లు, మూజన్లకు గౌరవ వేతనం అందిస్తామన్న హామీని తక్షణమే అమలు చేయడం తమ సమాజానికి పెద్ద ఊరటనిచ్చిందన్నారు. మతసేవ చేస్తూ జీవనోపాధి నెరపే తమ మతగురువులకు ఇది గొప్ప బలం అని స్థానిక ముస్లిం నాయకులు అభినందించారు. మైనారిటీల విద్య, ఉపాధి, ఆర్థికాభివృద్ధితో పాటు మతగురువుల గౌరవం కాపాడటమే తమ లక్ష్యం అని టిడిపి శ్రేణులు సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు అబ్దుల్ ఖాదర్, దాదం శివారెడ్డి, బార్ బషీర్ అహ్మద్, మాబు సాబ్, మండల ప్రభుత్వ ఖాజీ అమీర్ ఖాన్, సద్దపల్లి శుభహాన్, రాళ్లపల్లి బాలాజీ, భాష, మండల వ్యాప్తంగా ఉన్న మసీదుల ఇమామ్లు, మోజాన్లు, మజీద్ ముతవల్లిలు అలీ సాబ్, ముస్లిం మైనార్టీ సోదరులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రమోషన్ కౌన్సిలింగ్‌ను త్వరగా పూర్తిచేయాలని డిపిఒకు వినతి



డిపిఒకు వినతిపత్రం అందచేస్తున్న దృశ్యం

**పుట్లూరు, నవంబర్ 25 ప్రభాతవార్త**

ప్రమోషన్ కౌన్సిలింగ్‌ను త్వరగా పూర్తి చేయాలని డిపిఒకు పంచాయతీ కార్యదర్శి గ్రేడ్ 6 ఉద్యోగుల సంఘం వారు మంగళవారం వినతిపత్రం అందచేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శి గ్రేడ్ 6 ఉద్యోగులకు ప్రమోషన్ల కొరకు 120 మందికి అప్రూవల్ అయిన లిస్ట్ ద్వారా ఈ నెల 25వతేదీన కౌన్సిలింగ్ జరపవలసి ఉందని కానీ కౌన్సిలింగ్ ప్రక్రియను జిల్లా పంచాయతీ అధికారి వాయిదా వేయడమైందన్నారు. ఇందుకు గల కారణం అనంతపురం జిల్లాలోని పంచాయతీ కార్యదర్శి గ్రేడ్ 6లో పనిచేస్తున్న ఎస్‌సి అభ్యర్థుల్లో కేటగిరి 1 మరియు 2లో రోస్టర్ తయారీ విధానంలో తప్పిదాలు జరిగాయని కొందరి అభ్యర్థన మేరకు ఈ కౌన్సిలింగ్‌ను వాయిదా వేయడమైందన్నారు. ఈ రోస్టర్‌కు సంబంధించి పంచాయతీ కార్యదర్శి గ్రేడ్ 6 వారికి గ్రేడ్ 5 గా ప్రమోషన్ కల్పిస్తూ తయారు చేసిన 120 మంది లిస్టును ఇదివరకే ఉద్యోగుల అసోసియేషన్‌కు వివరించడం జరిగిందని ఇందులో ఎటువంటి తప్పిదాలు జరగలేదని తేలడమైందన్నారు. అయినా కూడా కొందరి అభ్యర్థన మేరకు కౌన్సిలింగ్ ప్రక్రియ వాయిదా వేయడం జరిగిందన్నారు. దీని ద్వారా ప్రమోషన్ వచ్చే వారికి తదుపరి సీనియారిటీలో జాప్యం జరుగుతుందన్నారు. ఎటువంటి వాయిదా లేకుండా రోస్టర్ కరెక్టుగా ఉన్నందున ప్రమోషన్ కౌన్సిలింగ్‌ను త్వరగా పూర్తిచేయాలని వారు జిల్లా పంచాయతీ అధికారికి విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘ సభ్యులు ఉమేష్, మారుతినాయుడు, నాగభూషణ, హనుమంతుగౌడ్, రాజేష్, నూర్‌మహమ్మద్, శ్రీకాంత్, మంజునాథ్, పుట్లూరు మండల డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## జె.సి ప్రభాకర్‌రెడ్డిని కలిసిన మార్కెట్‌యార్డు ఛైర్ పర్సన్



జె.సి ప్రభాకర్‌రెడ్డితో భూమా నాగరాగిణి, భూమా రవి

**తాడిపత్రిటౌన్, నవంబర్ 25 ప్రభాతవార్త**

తాడిపత్రి మున్సిపల్‌చైర్మన్ జె.సి ప్రభాకర్‌రెడ్డి భుజానికి జర్మనీలో శస్త్ర చికిత్స చేయించుకుని హైదరాబాద్‌లోని తమ నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయంను తెలుసుకున్న తాడిపత్రి మార్కెట్‌యార్డు చైర్ పర్సన్ భూమా నాగరాగిణి ఆమె భర్త భూమా రవిలు హైదరాబాద్‌కు వెళ్లి జె.సి ప్రభాకర్‌రెడ్డిని ప్రత్యేకంగా కలిసి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని వారు ఆకాంక్షించారు.

## గ్యార్మీ వేడుకల్లో పాల్గొన్న ఫయాజ్‌బాష



భోజనం వడ్డిస్తున్న ఫయాజ్‌బాష

**తాడిపత్రిటౌన్, నవంబర్ 25 ప్రభాతవార్త**

తాడిపత్రిలోని బండా మస్జిద్ వద్ద ఉన్న జెండా కట్ట వద్ద మంగళవారం నిర్వహించిన గ్యార్మీ వేడుకల్లో వైఎస్ఆర్‌సిపి రాష్ట్ర కార్యదర్శి, ఫయాజ్‌బాషా ట్రస్ట్ చైర్మన్ హీరాపురం ఫయాజ్‌బాషా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జెండా కట్ట వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వేడుకల్లో పాల్గొన్న వారికి ఫయాజ్‌బాష స్వయంగా భోజనాన్ని వడ్డించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

## భగత్‌సింగ్‌నగర్‌లో నూతన డ్రైనేజీ, పైప్‌లైన్ పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

**తాడిపత్రిటౌన్, నవంబర్ 25 ప్రభాతవార్త**

పట్టణంలోని భగత్‌సింగ్‌నగర్‌లో నూతన డ్రైనేజీ, పైపులైన్ పనులను మంగళవారం ప్రారంభించారు. ఈ పనులకు సంబంధించి గత కొన్ని రోజుల క్రితం ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. దీంతో ఈ పనులను కౌన్సిలర్ మల్లికార్జున ప్రారంభించారు. అండర్ డ్రైనేజ్ పనులు, పైపులైన్ పనులు చేపడుతుండడం పట్ల వార్డు ప్రజలు ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి, మున్సిపల్‌చైర్మన్ జె.సి ప్రభాకర్‌రెడ్డికి ధన్యవాదాలు తెలియజేశారు.

## చర్చి పునఃనిర్మాణానికి ఆర్థిక సాయం



విరాళం అందజేస్తున్న దాసరి వెంకటరమణ

**శింగనమల, నవంబర్ 25 ప్రభాతవార్త**

మండల పరిధిలోని గురుగుంట్ల గ్రామంలో చర్చి పునఃనిర్మాణ పనులకు నాగలగుడ్డం గ్రామానికి చెందిన వైఎస్ఆర్‌సిపి నాయకుడు దాసరి వెంకటరమణ 50 సిమెంట్ పాకెట్లు, 5వేలు నగదును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గురుగుంట్ల గ్రామంలో పూర్తిగా శిథిలమైన చర్చిని పున:నిర్మిస్తున్నామని దాతలు తనను సంప్రదించగా తన వంతు సహాయం చేసినట్లు ఆయన తె లిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్‌సిపి నేతలు పెద్దిరెడ్డి, నారాయణరెడ్డి, ఆది, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

## అక్కదేవతల ఆలయం అభివృద్ధికి చేయూతనివ్వండి



అక్కదేవతల ఆలయం

**అమడగూరు, నవంబర్ 25 ప్రభాతవార్త**

మండల పరిధిలోని చీకిరేవులపల్లి పంచాయతీ ఏ.రెడ్డివారిపల్లి గ్రామంలో వెలసిన అతి పురాతన అక్కదేవతల ఆలయం అభివృద్ధికి చేయూతనివ్వాలని ఆలయ నిర్వాహకులు కోరుతున్నారు. దాదాపు 130 సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ ఆలయం 1890లో పూజారి వెంకటరమణయాదవుడి కలలో అక్కదేవతలు కనపడి చెప్పగా అప్పటి నుంచి పూజలు చేస్తూ చిన్న ఆలయం కట్టడం జరిగింది. అప్పటి నుండి ఇప్పటి వరుకు పూజలు జరుగుతూనే వున్నాయి. ప్రస్తుతం ఆయన పెద్ద కుమారుడు నరసింహులు పూజలు నిర్వహిస్తున్నారు. ఈ ఆలయంలో నాగులకట్ట, మునీశ్వరస్వామి పాదములు, ఈ ఆలయానికి ముందర కోనేరు వుంది. ప్రతి ఏడాది జూన్ మాసంలో అక్కమ్మ దేవతల ఉత్సవాలు పెద్దఎత్తున జరుపుతామని, గత కొన్ని సంవత్సరాలుగా వివిధ రాజకీయపార్టీల నాయకులు ఎన్నికల సమయంలో మేము దేవాలయ నిర్మాణం చేపడతాం, రోడ్లు అనుమతి చేపిస్తాము, నీటి సౌకర్యం కల్పిస్తామని మాటలు చెప్పి తప్పించుకుంటున్నారని ఇప్పటికైనా రెడ్డివారిపల్లి గ్రామ సమీపాన బైరవస్వామి గుడి వద్ద నుండి అక్కమ్మ దేవతల గుడి వరకు సిసి రోడ్డు మరమ్మతులు చేసి ఆలయాన్ని అభివృద్ధి చేయాలని పూజారులు ప్రజాప్రతినిధులు, అధికారులను కోరుతున్నారు.

## పలు సర్కిల్‌లలో కోటి సంతకాల సేకరణ



సంతకాల సేకరణ చేస్తున్న దృశ్యం

**అనంతపురం కల్చరల్, నవంబర్ 25 ప్రభాతవార్త**

రాష్ట్రంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రవేటీ కరణకు వ్యతిరేకంగా మంగళ వారం నగర ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాసులు ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. మంగళవారం అనంతపురం నగరంలో వైసిపి నాయి బ్రాహ్మణుల సంఘం ఆధ్వర్యంలో వైద్య కళాశాలలను ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి కొంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. అనంతపురం పట్టణంలో అశోక్‌నగర్, హౌసింగ్ బోర్డ్, హరిహర దేవాలయం సర్కిల్ నందు ప్రతి సెలూన్ షాపుకు వెళ్లి వారికి విషయం వివరించి వారితో సంతకాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ నాయిబ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ఎం.రామకృష్ణ, నగర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి, మున్సిపల్ విభాగం ప్రధాన కార్యదర్శి జిఎం విజయభాస్కర, నాయకులు మద్దిలేటప్ప పాల్గొన్నారు.

## పేద విద్యార్థులకు అండగా జై భీమ్ రావ్ భారత్ పార్టీ అండ

**కూడేరు, నవంబర్ 25 ప్రభాతవార్త**



ఉచిత ట్యూషన్ కేంద్రంలో విద్యార్థులు

జైభీమ్ రావ్ భారత్ పార్టీ ఆధ్వర్యంలో కూడేరు మండలంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనారిటీ వర్గాలకు చెందిన పేద విద్యార్థుల కోసం ఉచిత ట్యూషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కేంద్రం ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్యను ఉచితంగా అందించేందుకు జైభీమ్ రావ్ భారత్ పార్టీ కృషి చేస్తోంది. ఉచిత ట్యూషన్ కేటాయింపు, సామగ్రి పంపిణీ, జైభీమ్ రావ్ భారత్ పార్టీ అనంతపురం జిల్లా అధ్యక్షులు రామప్ప నాయక్ ఆదేశాల మేరకు, కూడేరు మండలంలో నిర్వహిస్తున్న ఉచిత ట్యూషన్ కేంద్రంలో చదువుతున్న విద్యార్థులకు ప్రోత్సాహం అందించేందుకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు.

## ఓరువాయి పంచాయతీలో రైతన్న మీకోసం



రైతన్న మీకోసం కార్యక్రమం పై రైతులకు అవగాహన కల్పిస్తున్న లక్ష్మీ ప్రియ

**నల్లచెరువు నవంబర్ 25, ప్రభాతవార్త**

మండల పరిధిలోని ఓరువాయి పంచాయతీలో మంగళవారం మండల వ్యవసాయ అధికారి లక్ష్మీ ప్రియ ఆధ్వర్యంలో ప్రభుత్వం రైతుల కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతన్న మీకోసం కార్యక్రమం కుమ్మరవాండ్లపల్లిలో నిర్వ హించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ ప్రభుత్వం ఏవోరైతుల కోసం ఇస్తున్నటువంటి సబ్సిడీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపు నిచ్చారు. గ్రామంలో ప్రతిగడపకు తిరుగుతూ రైతులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై రైతులతో ముఖాముఖి నిర్వహించారు. ఏవోతో పాటు ఎంపీడీవో అశోక్‌కుమార్‌రెడ్డి, విఆర్ఓ నిర్మల, టిడిపి నాయకులు సతీష్ చౌదరి, దేవేంద్ర గౌడ్ సచివాలయ సిబ్బంది. గ్రామస్తులు పాల్గొన్నారు.

## అదుపు తప్పి సిమెంట్ లారీ బోల్తా

**- స్వల్ప గాయాలతో బయపటపడ్డ డ్రైవర్, క్లీనర్**

**ఓబుళదేవరచెరువు, నవంబర్ 25, ప్రభాతవార్త**



అదుపు తప్పి బోల్తా పడ్డ లారీ

మండల పరిధిలోని సుందరయ్య కాలనీ సమీపంలో మంగళవారం సాయంకాలం 18 చక్రాల సిమెంట్ లారీ అదుపు తప్పి బోల్తాపడినట్లు స్థానికులు తెలియచేశారు. సిమెంటు లారీ కడప జిల్లా చిలమ కూరు నుండి తుముకూరు వెళుతోందన్నారు. అయితే ఓడీచెరువు వైపు నుంచి ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహన్ని తప్పించే క్రమంలో సిమెంటు లారీ అదుపు తప్పి బోల్తాపడిందన్నారు. ఈ ప్రమాదంలో మండలంలోని వేమారెడ్డిపల్లికి చెందిన లారీ డ్రైవర్ భాస్కర్, క్లీనర్‌కు గాయాలవ్వటంతో కదిరి ప్రభుత్వ అసుపత్రికి తరిలించామన్నారు. కొత్తగా నిర్మించిన నాలుగు వరుసల రహదారి వద్ద ద్విచక్రవాహనదారులు రోడ్డు దాటేటప్పుడు తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు వాహన చోదకులకు సంబంధిత అధికారులు అవగాహన కలిగించాలని పలువురు కోరుకుంటున్నారు.

## ఎంపీపీకి ఘన సన్మానం...



ఎంపీపీ కి సన్మానం చేస్తున్న ఎంపీడీవో ఎన్ అశోక్ కుమార్ రెడ్డి,

**నల్లచెరువు నవంబర్ 25 ప్రభాత వార్త**

స్థానిక మండల అభివృద్ధి కార్యాలయం నందు నూతన ఎంపీడీవో గా బాధ్యతలు చేపట్టిన ఎన్ అశోక్ కుమార్ రెడ్డి మంగళవారం ఎంపీపీ రమణారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఎంపీపీ రమణారెడ్డికి పూలమాలు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నారాయణస్వామి తో పాటు పలువురు సర్పంచులు ఎంపీటీసీలు పాల్గొన్నారు.

## బళ్లారి కొత్త మేయర్‌గా పి.గాదెప్ప ప్రమాణ స్వీకారం



ప్రమాణస్వీకారం చేస్తున్న దృశ్యం

**బళ్లారి నవంబర్ 25 ప్రభాతవార్త**



గాదెప్ప కు శుభాకాంక్షలు తెలుపుతున్న కార్పొరేటర్ ఉమాదేవి శివరాజ్.

బళ్లారి నగర నూతన మేయర్‌గా పి.గాదెప్ప ఈరోజు నగర కార్పొరేషన్ మేయర్ గదిలో ప్రార్థనలు చేసి ప్రమాణ స్వీకారం చేశారు. అంతకుముందు, ఆయన దుర్గమ్మ ఆలయం నుండి వాదమేద్యాలతో, జన సమూహం మధ్య ఊరేగింపులో బళ్లారి నగర కార్పొరేషన్ కార్యాలయానికి వచ్చారు. ఈ నెల 15న జరిగిన ఎన్నికల్లో, పార్టీ నిర్ణయం ప్రకారం, పి.గాదెప్ప బిజెపి అభ్యర్థి కోనంకి తిలక్‌పై అఖండ విజయం సాధించారు. పి.గాదెప్ప 23వ వార్డు సభ్యులు, కార్పొరేషన్ అసెంబ్లీ నాయకుడు మరియు కృషికా సమాజ్ ప్రస్తుత జిల్లా అధ్యక్షుడు కూడా. కాంగ్రెస్ పార్టీతో గుర్తింపు పొందిన పి.గాదెప్ప ఎల్లప్పుడూ పార్టీకి విధేయుడిగా ఉన్నారు. కార్పొరేషన్ కమిషనర్ పి.ఎస్. మంజునాథ్ మరియు బళ్లారి నగర కల్యాణస్వామి మఠం గౌరవనీయులైన శ్రీ స్వామీ సమక్షంలో ఆయన ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లంప్రశాంత్ మరియు కార్పొరేటర్ ఉమాదేవి శివరాజ్, వివిధ వార్డుల కార్పొరేట్ సభ్యులు, అధికారులు మరియు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

## పరిశుభ్రతపై అవగాహన సదస్సు



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**అమడగూరు, నవంబర్ 25 ప్రభాతవార్త**

ఆమడగూరు మండలంలో 10 గ్రామ పంచాయతీలకు సంబంధించి పంచాయతీ కార్యదర్శులకు, సర్పంచులకు వార్డు మెంబర్లకు, ప్రజా ప్రతినిధులకు స్థానిక ప్రజాపరిషత్ కార్యాలయంలో మంగళవారం ఇఒఆర్‌డి రాజశేఖర్ ఆధ్వర్యంలో పరిశుభ్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇఒఆర్‌డి మాట్లాడుతూ 5 క్లీన్ అండ్ గ్రీన్ సంబంధించిన ట్రైనింగ్ మరియు గ్రామాల్లో చెత్త చేయకుండా గ్రామాల్లోనే ఊరి బయట నిల్వచేసి చెత్తను ఎస్‌డబ్ల్యూఎం సాలిడ్ ఎల్‌డబ్ల్యూఎం లిక్విడ్ ప్లాస్టిక్ వేస్ట్ ప్లాస్టిక్ మేనేజ్మెంట్ తయారు చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ మునెప్ప, ఏఒ మల్లికార్జునరెడ్డి, సెక్రటరీ సునియాబేగం, రామలింగారెడ్డి, నరేంద్ర, శ్రీకాంత్, చంద్రారెడ్డి, భాస్కర్, మమత, సర్పంచులు షబ్బీర్, సద్దపల్లి శ్రీధర్‌రెడ్డి, ఆదినారాయణ, ఉప సర్పంచులు, వార్డు మెంబర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# దుర్గా భవాని ఆలయంలో భక్తిశ్రద్ధలతో చండీ హోమం

## -వైభవంగా అమ్మవారి గ్రామోత్సవం, భక్తులకు అన్నదానం

ఉరవకొండ, నవంబరు 25 ప్రభాతవార్త



పట్టణంలోని స్థానిక వెలుగు కార్యాలయం పక్కనగల దుర్గాభవాని ఆలయంలో స్వస్తిశ్రీ విశ్వావసునామ సంవత్సరం మార్గశిర పంచమి మంగళవారం ఆలయ 8వ వార్షికోత్సవ వేడుకలు వైభవంగా జరిగాయి. ఫణిస్వామి నేతృత్వంలోని అర్చక బృందం ప్రాతఃకాలంలో అమ్మవారికి మూలవిరాట్‌కు పంచామృతా భిషేకం, విశేషద్రవ్యములతో అభిషేకం, గణపతి, సుబ్రమణ్యస్వామి, మల్లేశ్వరస్వామివార్లకు రుద్రాభిషేకం, చండీ హోమం నిర్వహించారు. అనంతరం వివిధ రకాల పుష్పాలతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు, అర్చనలు నిర్వహించారు. అమ్మవారి దివ్యమంగళ రూపాన్ని పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి దర్శించుకొని కుంకుమార్చనలు నిర్వహించారు. మధ్యాన్నం అన్నదాన కార్యక్రమం కొనసాగగా సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్‌లో అమ్మవారి ఉత్సవమూర్తిని కొలువుదీర్చి మేళతాళాలు మంగళవాయిద్యాల నడుమ గ్రామోత్సవం నిర్వహించారు. దారిపొడవునా అమ్మవారి మాలదారుల నృత్యాలు, కీర్తనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

# ఇనగలూరు, నర్సాంబూదిలో రైతన్న మీకోసం

అగళి, నవంబర్ 25 ప్రభాతవార్త



రైతన్న మీకోసం పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం

మంగళవారం మండల పరిధిలోని ఇనగలూరు, నర్సాంబూది, దొక్కలపల్లి, హెచ్‌డి హళ్లి గ్రామాల్లో వ్యవసాయం పట్టు పరిశ్రమ అధికారులు రైతన్న మీకోసం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇందులో భాగంగా కూటమి ప్రభుత్వం రైతులకు అందజేస్తున్న సబ్సిడీలు, అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ లాంటి వాటిని గురించి వివరించారు. మండల వ్యవసాయ అధికారి నాగరాజు రైతన్న మీకోసం గురించి రైతుల గురించి మాట్లాడారు. పట్టు పరిశ్రమలో రైతులకు గల వివిధ రకాల పథకాలు, ప్రోత్సాహకాల గురించి రైతులకు తెలిపారు. మల్బరీ నాటినందుకు జనరల్ కేటగిరి రైతులకు ఎకరాకు 22500, ఎస్సీ, ఎస్టీ రైతులకు ఎకరాకు 27వేలు, టైప్-1 చెట్టు వెడల్పు 20 అడుగులు, పొడవు 50 అడుగులు ఉంటే పట్టు పరిశ్రమ ద్వారా 3,37,500, టైప్-2 షెడ్డు వెడల్పు 20 అడుగులు, పొడవు 35 అడుగులు ఉంటే పట్టు పరిశ్రమ ద్వారా 2,47,500 లబ్ది పొందవచ్చని అలాగే ఉపాధిహామీ ద్వారా మల్బరీ నాటుకున్నందుకు కూడా ప్రోత్సాహకాలు ఉన్నాయని తెలిపారు. రైతు సోదరులందరూ పట్టుగూళ్ల కేజీ దాదాపు 900 ఉందని ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులు సెరికల్చర్ అధికారులు, సచివాలయ ఉద్యోగుల పాల్గొన్నారు.

# బైక్ మీద నుండి క్రిందపడి వ్యక్తి మృతి

వజ్రకరూరు నవంబర్ 25 ప్రభాతవార్త



మృతుడు రామకృష్ణ (ఫైల్ ఫోటో)

బైక్ మీద నుండి కిందపడి వ్యక్తి మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్సై నాగ స్వామి తెలిపిన వివరాలు మేరకు... మండల కేంద్రానికి చెందిన రామకృష్ణ (49) వ్యవసాయం చేసుకుంటూ వీలున్నప్పుడల్లా షార్ట్ ఫిలింలలో నటిస్తూ జీవనం సాగిస్తున్నాడు. పొలంలో సాగు చేస్తున్న వేరుశనగ పంటకు పురుగుల మందును పిచికారి చేయడానికి సోమవారం అనంతపురంకు వెళ్లి పురుగుల మందుని తీసుకొని రాత్రి సమయంలో తిరిగి వస్తున్నాడు. బోడిసానిపల్లి గ్రామం దాటిన తర్వాత బైకు కు జింకల గుంపు అడ్డు వచ్చి అందులోని ఒక జింక బైక్ ను తగలడంతో బైక్ మీద ప్రయాణిస్తున్న మృతుడు కిందపడి తలకు తీవ్ర గాయం అయ్యింది. రాత్రి సమయమైన ఇంటికి రాకపోవడంతో మృతిని కుమారుడు జై వీరాంజనేయులు ఫోన్ చేశాడు. ఫోన్ ఎత్తకపోవడంతో పదేపదే ఫోన్ చేస్తూనే ఉన్నాడు. అదే సమయంలో వజ్రకరూరుకు చెందిన కొందరు వస్తూ కిందపడిన బండిని గమనించి సమీపంలో కిందపడిన మృతున్ని గుర్తించారు. ఫోన్ రింగ్ అవుతుండడంతో సమాచారాన్ని కుటుంబ సభ్యులకు అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకొని 108 వాహనంలో అనంతపురంలోని ప్రైవేట్ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. పరిశీలించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. భార్య పుణ్యవతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# ప్లాస్టిక్ వాడకం ద్వారా మానవాళికి అనర్థాలు - ఎంపీడీవో రామారావు



ప్లాస్టిక్ పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

అమరాపురం నవంబర్ 25 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం నందు ప్లాస్టిక్ వాడకంపై అవగాహన కార్యక్రమాన్ని ఎంపీడీవో రామారావు అధ్యక్షతన అవగాహన సదస్సును మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఎంపీడీవో ప్రసాద్, పరిపాలన అధికారి విశ్వేశ్వర ఆరాధ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం ద్వారా మానవాళికి అనర్థాలు చోటు చేసుకుంటున్నాయని గ్రామ స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని గ్రామ కార్యదర్శిలకు సచివాలయ సిబ్బందికి ప్రజాప్రతినిధులకు సూచించారు. ముఖ్యంగా ప్లాస్టిక్ వాడకం ద్వారా వచ్చే అనర్థాలను వివరిస్తూ ప్లాస్టిక్‌ను మురికి కాలువల్లో వేయడం ద్వారా దోమలు వృద్ధి చెంది ప్రజలకు హాని కలిగిస్తాయి అన్నారు. అదేవిధంగా ప్లాస్టిక్ ను కాల్చడం ద్వారా వచ్చే పొగనుతో త్రాగడంతో మూత్రపిండాలు దెబ్బతింటాయని, ప్లాస్టిక్ బాటిళ్లలో మీరు తాగడం ద్వారా అనేక రోగాలకు ఆస్కారం ఉందన్నారు. అదేవిధంగా ట్రైనర్ వీర కర్యప్ప విచ్చేసిన అధికారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శిలు ఈరన్న, నరేష్ బాబు, ఉషారాణి, నాగమణి, గౌరమ్మ, మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కుక్కకాటు వ్యాధి (రేబీస్) నివారణ టీకాల కార్యక్రమం

కనగానపల్లి నవంబర్ 25 ప్రభాతవార్త

మండల పరిధి లోని రాంపురం గ్రామంలో మంగళవారం భారీ స్థాయిలో కుక్కకాటు వ్యాధి (రేబీస్) నివారణ టీకాల కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది. గ్రామంలో మొత్తం 243 పశువులకు మరియు 13 కుక్కలకు యాంటీ రేబీస్ టీకాలు అందించారు. ఈ కార్యక్రమం మండల పశు వైద్యాధికారి డా. సునీల్ కుమార్ పర్యవేక్షణలో జరిగింది. ఆయనతో పాటు పశుసంవర్ధక సహాయకులు హరినాయక్, నిరంజన్‌టీకాల కార్యక్రమంలో పాల్గొని సేవలు అందించారు. మండల పశువైద్యాధికారి డా సునీల్ కుమార్‌మాట్లాడుతూ గ్రామ ప్రజలకు కుక్క కరిచిన పశువులకు తప్పనిసరిగా పోస్ట్-బైట్ (కాటు తరువాత) రేబీస్ టీకాలు వేయించుకోవాలనే అవగాహన కల్పించారు. కుక్క కాటు జరిగిన వెంటనే వెటర్నరీ వైద్యుడిని సంప్రదించి, నిర్ణీత షెడ్యూల్ ప్రకారం టీకాలు పూర్తి చేయడం ద్వారా రేబీస్ వ్యాధిని సమర్థవంతంగా నివారించ వచ్చని వివరించారు. గ్రామ ప్రజలు తమ పశువులను సకాలంలో టీకాలు వేయించుకోవాలని ఆయన కోరారు.



ఆవులకు టీకాలు వేస్తున్న దృశ్యం

# విద్యుత్ స్తంభం ఎక్కి పనులు చేస్తూ షాక్ గురై మృతి చెందిన విద్యార్థి.

కనగానపల్లి నవంబర్ 25 ప్రభాత వార్త



విద్యుత్ స్తంభం పై వేలాడుతున్న విద్యార్థి వరుణ్ మృత దేహం.

మండల కేంద్రానికి చెందిన బిల్లే వరుణ్ 15 సం విద్యుత్ పనులు చేస్తూ మృతి చెందాడు. గ్రామస్తులు వారి బంధువుల వివరాలు మేరకు మండల కేంద్రానికి చెందిన వడ్ల వన్నూరప్ప తోటలో విద్యుత్ స్తంభం నుండి మోటార్ కు వెళ్లే వైర్లు చుడుతుండగా షాక్ గురై బిల్లే వరుణ్ విద్యుత్ స్తంభం పైనే మృతదేహం వేలాడింది. బిల్లే నాగభూషణ, ఉమాదేవి లకు కొడుకు, కూతురు ఉన్నారు. మృతి చెందిన విద్యార్థి బిల్లే వరుణ్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హై స్కూల్లో పదవ తరగతి చదువుతున్నాడు. స్కూలు కు వెళ్లే బిల్లే వరుణ్ తోట యజమాని లేక ట్రాన్స్కో సిబ్బంది ఎవరైనా పిలిచికెళ్లి పనులు చేయించుకున్న క్రమంలో ఈ ప్రమాదం జరిగి ఉంటుందని అక్కడికి వచ్చిన జనం చర్చించుకోవడం జరిగింది. ఉన్న ఒక్కగానొక్క కుమారుడు విద్యుత్ ప్రమాదంలో మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని విద్యార్థి మృతికి తోట యజమానా లేక ట్రాన్స్కో సిబ్బంది కారణమా అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. మండల విద్యుత్ శాఖ ఏఈ వివరణ. వడ్ల వన్నూరప్ప తోటలో విద్యుత్ పనుల కోసం విద్యుత్ ఆపరేటర్ తో కూడా ఎల్ సి తీసుకోలేదని ఏఈ కొండారెడ్డి వివరణ ఇచ్చారు.

# కప్పేసిన పొగ మంచు - ఇబ్బందులు పడ్డ వాహనదారులు

గుత్తి, నవంబర్ 25 ప్రభాతవార్త



పొగ మంచు కప్పేసిన దృశ్యం

పట్టణంలో మంగళవారం తెల్లవారుజామున పొగ మంచు కప్పేయడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఉదయం 7 గంటల అయినప్పటికీ మంచు అధికంగా ఉండడంతో వాహనదారులు లైట్ వేసుకొని రోడ్డుపై ప్రయాణించాల్సి వచ్చింది. వాతావరణంలో సంభవించిన మార్పుల కారణంగా మంగళవారం ఉదయం పొగ మంచు కారణంగా వాకింగ్ పోయిన వాకర్లు సైతం ఇబ్బందులు పడ్డారు.

# మాజీ సింగల్ విండో అధ్యక్షునికి మాతృ వియోగం

తాడిమర్రి నవంబర్ 25 (ప్రభాతవార్త)



పోర్రాళ్ళ నారాయణమ్మ ఫైల్ ఫోటో

మండల మాజీ సింగల్ విండో అధ్యక్షుడు పోరాల్ల భాస్కర్ రెడ్డి కి సోమవారం రాత్రి మాతృ వియోగం. పుల్లా నారాయణ పల్లి స్వగృహంలో తల్లి పోర్రాళ్ల నారాయణమ్మ(90) స్వర్గస్తులైనారు. ఈ విషయం తెలుసుకున్న వైసిపి స్టేట్ కౌన్సిల్ మెంబర్ తాడిమర్రి చంద్రశేఖర్ రెడ్డి, కేతిరెడ్డి వెంకట కృష్ణారెడ్డి, జోలి రెడ్డి అశ్వర్థ, వై.టి చంద్రశేఖర్ రెడ్డి, మాజీ ఎంపీపీ గోపాల్ రెడ్డి, మాజీ సచివాలయాలకు కన్వీనర్ సాయినాథ్ రెడ్డి, కునుకుంట్ల బాల రమణారెడ్డి, వైసిపి నాయకులు, కార్యకర్తలు భాస్కర్ రెడ్డి కుటుంబ సభ్యులను ఓదార్చి, తన తల్లి పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

# మహిళల కడుపు మాడ్చిన వెలుగు సిబ్బంది



సమావేశానికి హాజరైన మహిళలు

గుంతకల్లు, నవంబర్ 25 ప్రభాతవార్త

ఆయా గ్రామాల నుండి సమావేశానికి వచ్చిన డ్వాక్రా సంఘాల మహిళలకు మహిళా సమాఖ్య అధ్యక్షురాలు, వెలుగు సిబ్బంది సరైన భోజనం అందించలేదు. మంగళవారం వెలుగు కార్యాలయం ఆవరణలో మన డబ్బులుమన లెక్కలు యాప్‌పై అవగాహన కార్యక్రమం గుంతకల్లు మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు లక్ష్మీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ముఖ్యఅతిథిగా హాజరైన కార్యక్రమానికి నియోజకవర్గంలోని ఆయా గ్రామాల నుండి మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సమావేశం అనుకున్న సమయానికన్నా గంట ఆలస్యంగా ప్రారంభమైంది. అయితే కనీసం తాగడానికి మంచినీళ్ల పాకెట్లు కూడా ఇవ్వలేదు. సమావేశం పూర్తయ్యేసరికి సరిగ్గా భోజన సమయమైంది. కడుపునిండా భోజనం పెడతారనుకున్న మహిళలకు నిరాశ తప్పలేదు. కేవలం 20 రూపాయల చిత్రాన్నం ప్యాకెట్లు ఇచ్చి చేతులు దులుపుకోవడంతో మహిళలు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వస్తున్నారని దూర ప్రాంతాల నుండి వస్తే కనీసం అన్నం కూడా పెట్టలేకపోయారని మహిళా సమాఖ్య అధ్యక్షురాలు, సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా సమావేశానికి అయిన ఖర్చు మహిళా సమైఖ్యల నుండి వసూలు చేస్తారని సమాచారం.

# ఎన్నికల నిర్వహణపై విద్యార్థులకు అవగాహన

గుత్తి, నవంబర్ 25 ప్రభాతవార్త



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా విద్యార్థినిలకు ఎన్నికలపై అవగాహన కల్పించాలని పాఠశాలలో ఎస్‌పిఎల్ ఎన్నికలు నిర్వహించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుంకన్న తెలిపారు. విద్యార్థినిలకు ఓటింగ్ విధానం పట్ల అవగాహన కోసం సోషల్ ఉపాధ్యాయునిలు చక్కటి వాతావరణం కల్పించారు. పోలింగ్ బూత్, బ్యాలెట్ బాక్స్, బ్యాలెట్ పేపర్, ఎన్నికల సిబ్బందిగా పిఓ, ఏపీఓ, ఓపిఓ తదితర అధికారులను నియమించి ఎన్నికల నిర్వహణ తదితర అంశాలపై పూర్తిగా అర్థమయ్యేటట్లు వారికి అవగాహన కల్పించారు. అదేవిధంగా కౌంటింగ్ విధానంపై పిల్లలకు మంచి అవగాహన కల్పించినట్లు ఆయన తెలిపారు. అయితే ఈ ఎన్నికల్లో ఎస్‌పిఎల్‌గా టి.సృజన, అసిస్టెంట్ ఎస్‌పిఎల్‌గా అనూష ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

# అనుసంధానం చేస్తే.. చెరువులన్నీ జలకళ...!..

## నాడు ఎన్టీఆర్ కాలవ తవ్వించారు.. నేడు చంద్రబాబు నీటిని పరువళ్లు తొక్కిస్తున్నారు

## శాశ్వత నీటి పరిష్కారం కోసం పరిటాల శ్రీరామ్ తపన .. రైతన్న మీకోసం కార్యక్రమంలో మహేష్ చౌదరి వెల్లడి..



రైతన్న మీకోసం కార్యక్రమంలో మాట్లాడుతున్న అధికారులు తెదేపా నాయకులు

ధర్మవరం రూరల్ నవంబర్ 25 ప్రభాతవార్త

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు రైతన్న శ్రేయస్సు కోసం ఆనాడు తెలుగు గంగ ప్రాజెక్టు ద్వారా పీఏబీఆర్ కుడికాలు నుంచి తాగునీటికి వ్యవసాయానికి నీటిని సరఫరా చేసి చెరువులు నింపారు. అదే బాటలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు హంద్రీనీవా కాలువ ద్వారా నీటిని పరవళ్ళు తొక్కించి రాయలసీమ జిల్లాలోని చెరువులు నింపుతూ సస్యశ్యామలం చేస్తున్నారు. వారి స్ఫూర్తితో ధర్మవరం నియోజక వర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ పరిటాల శ్రీరామ్ హంద్రీనీవా కాలువ ద్వారా పీఏ బి ఆర్ కుడికాలు అనుసంధానం చేసి అన్ని చెరువులకు నీళ్లు నింపాలనే లక్ష్యముతో నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులతో చర్చించి చెరువులన్నీ జలకళలాడే విధంగా కృషి చేస్తున్నారని ధర్మవరం తెలుగుదేశం పార్టీ మండల క్లస్టర్ ఇంచార్జ్ మహేష్ చౌదరి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని పోతుకుంట గ్రామపంచాయతీలో మీకోసం రైతన్న కార్యక్రమంలో వ్యవసాయ అధికారులతో కలిసి ఏర్పాటుచేసిన సమావేశం లో వారు మాట్లాడుతూ హంద్రీనీవా కాలవ ద్వారా నీటిని పీఏబీఆర్ కెనాల్ కు అనుసంధానం చేయడం వల్ల ఇప్పటికే ధర్మవరం నియోజకవర్గం లోని ధర్మవరం గొట్లూరు బత్తలపల్లి మండలంలోని అప్రా చెరువు నిండి ఉన్నాయని ఈ క్రమంలో ధర్మవరం రూరల్ బత్తలపల్లి తాడిమర్రి మండలంలో చెరువులకు నీటిని నింపేందుకు ప్రయత్నం చేస్తున్నామని అన్నారు . గత ప్రభుత్వంలో రైతులను నిర్లక్ష్యం చేశారని కానీ నేడు ప్రతి రైతుకు అండగా ఉండేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. గత వైకాపా ప్రభుత్వంలో రైతులకు పెట్టుబడి నిధి కింద 14 వేల రూపాయలు మాత్రమే అందించే వారిని కానీ నేడు ఎన్ డి ఏ ప్రభుత్వంలో అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ నిదికిందా 20000 రూపాయలను ప్రతి రైతుకు అందిస్తున్నామని అన్నారు గత ప్రభుత్వంలో డ్రిప్, వ్యవసాయ పరికరాలు ఎరువులను రైతులకు అందించలేదని అన్నారు కానీ నేడు ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు 100 సబ్సిడీతో డ్రిప్పుమిగిలిన రైతులకు 90తో డ్రిప్పులను అందజేశామన్నారు. హార్టికల్చర్ హబ్బుగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని అన్నారు. ప్రతి గ్రామంలో పంటల స్థితి, ఎరువుల సరఫరా కనిష్ట మద్దతు ధర రైతుల బీమా వంటి అంశాలపై వివరాలు సేకరించి ప్రత్యేక యాప్ లో నమోదు చేస్తారని అన్నారు.. ఈ కార్యక్రమంలో ఏడీ లక్ష్మనాయక్, ఏవో ముస్తఫా సచివాలయ సిబ్బంది, టిడిపి నేతలు, గొట్లూరు శ్రీనివాసులు, మేకల రామాంజనేయులు, విజయ సారధి, పోతుకుంట రవి, తెలుగు మహిళా వెంకట లక్ష్మమ్మ, విజయ్ చౌదరి, కొండారెడ్డి, చిట్రా రమేష్, జంగం నరసింహులు, మల్లెనిపల్లి చంద్ర, భాస్కర్ చౌదరి, పాల్గొన్నారు.

# సర్దార్ వల్లభాయ్ పటేల్ జీవిత చరిత్ర పై వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

పెనుకొండ నవంబర్ 25 (ప్రభాత వార్త)

సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వజయంతి ఉత్సవాల్లో భాగంగా భారత కేంద్రప్రభుత్వం ఆదేశానుసారం లిటిల్ ఏంజిల్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జీవిత చరిత్రపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పెనకొండ పట్టణంలోని శ్రీ సత్యసాయి జూనియర్ ,డిగ్రీ కళాశాలలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా జరిగిన సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా పటేల్ జీవిత చరిత్ర పై వ్యాసరచన, వకృత్వం ,చిత్రలేఖనం పోటీలను విద్యార్థిని విద్యార్థులతో నిర్వహించారు. ఈ పోటీల్లో అన్నిశ్రేణుల్లోనూ ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ, బహుమతులను శ్రీ సత్య సాయి జూనియర్ ,డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్స్, చేతుల మీదుగా బహుమతు లను అందజేశారు. ఈ కార్యక్రమం లిటిల్ ఏంజిల్స్ ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షులు జాఫర్ వల్లి అధ్యక్షతన ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఆదిశేషరెడ్డి, జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్ షామీర్ భాష, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ కేశవయ్య , హ్యాండ్స్ నారాయణ , సోషల్ వర్కర్ చిక్కిరెడ్డి , లెక్చరర్ శ్రీనివాసరెడ్డి , రిటైర్డ్ ఎంఈఓ శివయ్య ,షమీవుల్లా విశ్రాంతి ప్రధానోపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామస్తులు చట్ట పరిధిలోనే జీవించాలి..!

ధర్మవరం రూరల్ నవంబర్ 25 ప్రభాతవార్త



గ్రామ సభలో గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ ఐ శ్రీనివాసులు

గ్రామస్తులందరూ చట్టపరిధిలోని జీవించాలని రూరల్ ఎస్ ఐ శ్రీనివాసులు తెలియజేశారు. ఈ సందర్భంగా మంగళవారం బడన్నపల్లి గ్రామంలో ఎస్సీ కాలనీ నందు ఎస్ ఐ శ్రీనివాసులు తన సిబ్బందితో కలిసి గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రామ సభలో గ్రామస్తులతో ఎస్ ఐ మాట్లాడుతూ గొడవలకు దూరంగా ఉండాలని గ్రామస్తులు అందరూ కలిసిమెలిసి ప్రశాంతంగా జీవించాలని మహిళల పట్ల గౌరవంగా ప్రవర్తిస్తూ పేకాటకు మద్యానికి బానిస కాకూడదని గ్రామంలో దొంగతనాలు జరగకుండా సీసీ కెమెరాలు బిగించుకోవాలని ఏదైనా సమస్య ఉంటే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్ ఐ శ్రీనివాసులు గ్రామస్తులు తెలిపారు.

# జన సైన్యం ఆధ్వర్యంలో నిమ్మల కు శుభాకాంక్షలు

గోరంట్ల నవంబర్ 25 ప్రభాతవార్త



నిమ్మల కిష్టప్పకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్న దృశ్యం.

మాజీ మంత్రి, మాజీ ఎంపీ, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు నిమ్మల కిష్టప్ప జన్మదినాన్ని పుష్కరించుకొని మండల జనసేన పార్టీ ఆధ్వర్యంలో నిమ్మలకిష్టప్పకు జన్మదినశుభాకాంక్షలు తెలుపుతూ ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా జనసేన పార్టీ మండల అధ్యక్షులు సంతోష్, జిల్లా కార్యదర్శి సురేష్‌ల నేతృతంలో మండల పార్టీనాయకులు గుంటిపల్లి నగేష్, తిరుపాల్, చిలమత్తూరి వెంకటేష్, గాజుల రమేష్, వీర మహిళ కావేరి, మల్లెల ఈశ్వర, గోవిందప్ప, కాలనీ శ్రీనివాసులు తదితరులు మంగళవారం సాయంత్రం నిమ్మల కిష్టప్ప నివాసంలో మామ ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

# చేతికందే ఎత్తులో విద్యుత్ వైర్లు

## ఆందోళన వ్యక్తం చేస్తున్న వ్యసాయ రైతు పట్టించుకోని విద్యుత్ అధికారులు



చేతికందే ఎత్తులో ఉన్న విద్యుత్ వైర్లను చూపుతున్న రైతులు

గుడిబండ నవంబర్ 25 ప్రభాతవార్త

మండల పరిధిలోని చిగతుర్పి గ్రామంలో తారేగౌడ్ అనే రైతు పొలంలో 11కెవి విద్యుత్ వైర్లు మనుషులకు తగిలేలా వేలాడుతున్నాయి. భయంభయంగా రైతు వ్యవసాయ పనులు చేసుకుంటున్నారు. విద్యుత్ శాఖ అధికారులకు ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో కూడా విద్యుత్ వైర్లు వేలాడుతున్నా విద్యుత్ అధికారులు పట్టించుకోవడం లేదని, ప్రమాదాలు జరిగితేనే స్పందిస్తారా అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారులు వెంటనే చేతికందే ఎత్తులో ఉన్న విద్యుత్ వైర్లులను ఎత్తు పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

# రైతు రాజ్యమే కూటమి ప్రభుత్వం ధ్యేయం

కొత్తచెరువు నవంబర్ 25 ప్రభాతవార్త



రైతన్న మీకోసం.. సర్వే కార్యక్రమంలో పాల్గొన్న ఏవో, రైతులు తెదేపా నాయకులు దృశ్యం.

రైతు రాజ్యం స్థాపన కోసమే కూటమి ప్రభుత్వం సీఎం చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని కొత్త చెరువు సింగిల్ విండో ప్రెసిడెంట్ హరి ప్రసాద్ పేర్కొన్నారు రైతన్న మీకోసం ఇంటింటికి సర్వే లో భాగంగా మంగళవారం కొత్తచెరువు రైతు సేవ కేంద్రం నందు రైతులకు అవగాహన కార్యక్రమం మండల వ్యవసాయ అధికారి సతీష్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు రైతన్నల కోసం ఏపీ ఏ ఐ ఎం ఎస్ ప్రత్యేక యాప్ నందు రైతు ఫోటో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని రైతులకు సూచించారు, అలాగే భూమి ఉన్న ప్రతి రైతు ఈ సర్వే లో నమోదు చేసుకోవాలన్నారు అన్నదాతలకు రానున్న ఐదు సంవత్సరాలలో చేపట్టే పంచ విధానాలకు సంబంధించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సందేశం యొక్క కరపత్రాలను రైతులకు అందజేశారు రైతన్నలకు అందిస్తున్న అన్నదాత సుఖీభవ పిఎ కిసాన్ పథకాలకు సంబంధించి రైతులకు తెలియజేశారు ఈ కార్యక్రమంలో తెదేపా సీనియర్ నాయకులు సాలక్క గారి శ్రీనివాసులు, కాంట్రాక్ట్ లక్ష్మీనారాయణ, అగ్రికల్చర్ అసిస్టెంట్లు సచివాలయ సిబ్బంది రైతులు పాల్గొన్నారు

# ప్రతి హింసా చర్యను నివారించాల్సిన బాధ్యత అందరిది



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు

ధర్మవరం, నవంబరు 25(ప్రభాతవార్త):

ప్రతి హింసా చర్యను నివారించాల్సిన బాధ్యత అందరిపై ఉందని సీనియర్ సివిల్జీ వెంకటేశ్వర్లు, జూనియర్ సివిల్జాడ్జీహరీశ్ల పేర్కొన్నారు. స్థానిక కోర్టుహాల్లో మంగళవారం మహిళలపై హింసనిర్మూలను అంతర్జాతీయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ...నేటి సమాజంలో మహిళలపై జరుగుతున్న హింస, వేధింపులు విషయంలో అనేక చట్టాలు ఉన్నాయని నేరం చేసిన వారు శిక్షార్హులన్నారు. ప్రతిఏడాది నవంబరు 25న అంతర్జాతీయ మహిళలపై హింసా నిర్మూలన దినోత్సవాన్ని జరుపుకుంటారన్నారు. మహిళలపై హింస అనేది మానవహక్కుల ఉల్లంఘన అని అందరికి అవగాహన కల్పించడం. జరిగే దాడులు లైంగిక వేధింపులు. ఇంట్లో బయటజరుగుతున్న ప్రతిహింసా చర్యను నివారించాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు బాలసుందరి, సుమలత, సిబ్బంది పాల్గొన్నారు.

# స్కూల్ విద్యార్థులను విచారించి అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన ఎంఈఓ. అరవింద్.

## విద్యార్థులతో అనవసర రాజకీయం తగదు. గ్రామస్తులు.

## ఉపాధ్యాయుల సమక్షంలో విద్యార్థుల సమస్యలు తెలుసుకోండి. ప్రధానోపాధ్యాయురాలు భాగ్యలక్ష్మి.

రొద్దం. నవంబర్ 25 ప్రభాతవార్త



విద్యార్థులను విచారిస్తున్న ఎంఈఓ.



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ గ్రామస్తులు.

కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో భాగంగా సోమవారం నారనాగేపల్లి గ్రామానికి వచ్చిన మాజీ మంత్రి ఉషశ్రీ చరన్ స్కూల్ సమయం అనంతరం అదే గ్రామానికి చెందిన విద్యార్థులతో స్కూల్లో సరైన విద్యాబోధన, స్కూల్ డ్రెస్సు ఉచిత పుస్తకాలు మధ్యాహ్న భోజనాలు ఎలా ఉన్నాయంటూ పిల్లలతో ఆరా తీయగా పిల్లలు తెలియజేస్తూ కొత్తగా వచ్చిన ప్రధానోపాధ్యాయురాలు భాగ్యలక్ష్మి వచ్చిన తర్వాత ప్రతి ఒక్క విషయంలోనూ జాగ్రత్త వహిస్తుందని విద్య తో పాటు క్రమశిక్షణ ఎప్పటికప్పుడు తల్లిదండ్రులతో సమావేశం అలాగే భోజనాలు కూడా చాలా చక్కగా ఉన్నాయని తెలియజేశారు అదే గ్రామానికి చెందిన కొంతమంది మాటలువిని పిల్లలు స్కూల్లో మధ్యాహ్న భోజనాలు సక్రమంగా లేదంటూ చెప్పారని ఒక పత్రికలో ప్రచురించబడింది ఈ విషయాన్ని గ్రామస్తులు ప్రధానోపాధ్యాయురాలు ఎంఈఓ అరవింద్ దృష్టికి తీసుకెళ్లగా హుటా హుటిన మంగళవారం నారనాగేపల్లి స్కూల్కు చేరుకొని గ్రామస్తులు స్కూల్ సిబ్బంది పాత్రికేయుల సమావేశంలో విద్యార్థులను జరిగిన విషయాలను అడిగి తెలుసుకున్నాడు పిల్లలు ప్రతి ఒక్క విషయంలోనూ స్కూల్ సిబ్బంది ప్రధానోపాధ్యాయురాలు జాగ్రత్త వహిస్తున్నారని ఇంతకు మునుపు కంటే ఇప్పుడే చాలా బాగుందని తెలియజేశారు ఏమైనా సమస్యలు ఉంటే గ్రామస్తులు తల్లిదండ్రులు ఉపాధ్యాయులకు తెలియజేయాలని ఎంఈఓ అరవింద పిల్లలకు తెలియజేస్తూ పిల్లలతో అనవసరమైన రాజకీయాలు చేయకూడదని మండల పరిధిలో ప్రతి ఒక్క స్కూల్లో ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు నిజాయితీగా విద్యార్థులకు విద్యాబోధన అందిస్తూ క్రమశిక్షణ పెద్దలతో ఎలా ఉండాలని తెలియజేస్తున్నారు తల్లిదండ్రులు కూడా పిల్లలను రాజకీయలకు దూరంగా ఉంచితే రాబోవు రోజుల్లో భావితరాలకు మీకు మీ గ్రామానికి మంచి పేరు తెచ్చే అవకాశం ఉంటుందని హితవు పలకడం జరిగింది కార్యక్రమంలో మాజీ సర్పంచులు నాగభూషణ మనోహర్ మాజీ డీలర్ ధనుంజయ గోవిందప్ప లింగప్ప గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనులకు సామాజిక తనికి: ఎంపీడీవో వెంకట రంగారావు

తాడిమర్రి నవంబర్ 25 (ప్రభాతవార్త)



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో వెంకట రంగారావు

మంగళవారం ఎంపిడిఓ కార్యాలయంలో జరిగిన గత ఆర్థిక సంవత్సరములో ఉపాధిహామీ పనులకు సంబందించిన సామాజిక తనిఖీ నిర్వహించడం కోసం ఎంపీడీవో వెంకటరంగా రావు అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ తనిఖీలు మండల వ్యాప్తంగా మూడు బృందాలతో నిర్వహించడం జరుగుతుందని, గతంలో జరిగిన మాదిరిగా కాకుండా ఒక నెల పాటు జరిగే అవకాశం ఉంటుందని డి ఆర్ పి భగవాన్ తెలిపారు.ఒకేసారి మూడు మండలాల్లో ఏక కాలంలో తనిఖీలు ప్రారంభం అవుతాయని, ఒక్కొక్క డిఆర్పి 4నుండి 5 పంచాయతీల్లో తనిఖీలు నిర్వహించి గ్రామ సభలు నిర్వహించిన తర్వాత మండల స్థాయిలో ప్రజావేదిక నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.ఎంపిడిఓ వెంకట రంగారావు మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న పనులకు ఆటంకం లేకుండా ఒక్కొక్క డి ఆర్ పి వారి బృందాలతో తనిఖీలు నిర్వహిస్తారని,తనిఖీ చేసే బృందాలు అవసరం మేరకు స్థానికంగా ఉంటారని తెలిపారు.ఉపాధి సిబ్బంది, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తనిఖీ బృందాలకు సహకరించాలని సూచించారు.మొట్ట మొదట భగవాన్ డి ఆర్ పి బృందం తనిఖీలు రామాపురం పంచాయతీ లో మొదలు పెడతారని ఎంపిడిఓ తెలిపారు. రామాపురం, చిల్ల కొండయ్య పల్లి, నార్సిం పల్లి, నిడిగల్లు మరియు తాడిమర్రి లు తనిఖీ చేస్తారని తెలిపారు. ఈ సమావేశంలో ఏపీవో లు అనిల్ కుమార్ రెడ్డి, సంజీవరెడ్డి, ఈసీ అశోక్ కుమార్ రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్లు, సి ఓలు, ఎఫ్ ఏ లు పాల్గొన్నారు.

## విద్యుత్ బకాయిల వసూళ్ల టార్గెట్ల ఒత్తిడులతో లైన్‌మ్యాన్ ఆత్మహత్యా యత్నం..!

-విద్యుత్‌శాఖ కార్యాలయ ఆవరణంలో సూపర్ వాస్మెల్ 33 తాగిన వైనం

ఉరవకొండ, నవంబరు 25 ప్రభాతవార్త



ఉరవకొండలోని విద్యుత్ కార్యాలయ సముదాయం

ఉరవకొండ విద్యుత్ సబ్ స్టేషన్‌లో పనిచేస్తున్న లైన్‌మెన్ ఒకరు మంగళవారం ఆత్మ హత్యా యత్నానికి పాల్పడటం కలకలం రేపింది. పై అధికారులు మొండి బకాయిల వసూళ్లకు పెట్టిన టార్గెట్లను పూర్తి చేయలేక తీవ్రమైన పని ఒత్తిడులతో గత కొంత కాలంగా తీవ్ర మనోవేదనకు గురవుతున్న అతను స్థానిక విద్యుత్ కార్యాలయం ఆవరణంలోనే తన వెంట తెచ్చుకున్న సూపర్ వాస్మెల్ 33 అనే తలకు వేసుకునే రంగును తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డారు. దీంతో గమనించిన తోటి ఉద్యోగులు అతన్ని హుటాహుటిన స్థానిక ప్రభుత్వాసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఇక్కడ ప్రాథమిక చికిత్స నిమిత్తం వైద్యుల సూచనల మేరకు మెరుగైన చికిత్సకై జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. ఘటనపై స్థానిక పోలీసులు ఆరాతీశారు. విద్యుత్ మొండి బకాయిల వసూళ్లకై సిబ్బందికి పై అధికారులు టార్గెట్లను ఇచ్చి ఒత్తిడులు చేస్తుండటంతో అనేక మంది కిందిస్థాయి ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నట్లు సమాచారం.

## సుబ్రమణ్యేశ్వరునికి పాలతో శత రుద్రాభిషేకం

- భక్తిశ్రద్ధలతో నవగ్రహ పరస్పర రుద్ర స్వాహాకారాలు
- నేడు స్వామివారి కళ్యాణోత్సవ, గ్రామోత్సవం





సుబ్రమణ్ణేశ్వరునికి 108 లీటర్ల పాలతో శత రుద్రాభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం, ప్రత్యేకాలంకరణలో సుబ్రణ్ణేశ్వరస్వామి మూలవిరాట్

ఉరవకొండ, నవంబరు 25 ప్రభాతవార్త

పట్టణంలోని సుబ్రమణ్ణేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 23వ తేదీ నుండి జరుగుతున్న స్వామివారి షష్ఠి ఉత్సవాల్లో భాగంగా స్వస్తిశ్రీ విశ్వావసునామ సంవత్సరం మార్గశిర శుద్ధ పంచమి మంగళవారం స్వామివారి మూలవిరాట్‌కు 108 లీటర్ల పాలతో శత రుద్రాభిషేకం అత్యంత భక్తిశ్రద్ధలతో కొనసాగింది. అనంతరం నవగ్రహ పరస్పర రుద్ర స్వాహాకారము, మహా మంగళహారతి కార్యక్రమాలు ఆలయ కార్యనిర్వహణ అధికారి కె.విజయ్‌కుమార్ పర్యవేక్షణలో అర్చకులు వి.పి.దివాకర శర్మ, వి.పి.నాగరాజుశర్మ, పి.శివకుమారశర్మ, కార్యకర్త కె.రామారావు, డా॥కె.కె.ప్రసాద్ బృందం ఆధ్వర్యంలో కొనసాగాయి. సాయంత్రం స్వామివారి కళ్యాణోత్సవానికి లగ్నపత్రిక, దీక్షాహవనము, నాగమండలారాధన, కుంకుమార్చనలు జరుగ్గా పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. బుధవారం ఉదయం అభిజిత్ లగ్నంలో శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రమణ్యేశ్వరస్వామి కళ్యాణోత్సవం, సాయంత్రం గ్రామోత్సవం జరుగనుండగా రాత్రి ఉయ్యాలసేవ, శయనోత్సవ కార్యక్రమాలు కొనసాగుతాయని అర్చకులు తెలిపారు.

## హుండీ లెక్కింపు ద్వారా 3 లక్షల 29 వేల ఆదాయం

అమరాపురం నవంబర్ 25 ప్రభాతవార్త

మండల పరిధిలో పవిత్ర పుణ్యక్షేత్రమైన హేమావతి ఏంజేరు సిద్దేశ్వర స్వామి దేవాలయం నందు మంగళవారం హుండీ లెక్కింపును దేవదాయ శాఖఈవో నరసింహరాజు, ఉప కమిషనర్ కార్యాలయం రమేష్ , అమరాపురం ఎస్సై ఇషాక్ బాషా, ఏఎస్ఐ రామాంజనేయులల సమక్షంలో హుండీ లెక్కింపునిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ కరేగౌడ్, గ్రామ పెద్దలు కుమార్ స్వామి, రామచంద్రప్ప, తిప్పజ్జ, ఎంపీటీసీ ఓంకార్ స్వామి, మాజీ ఎంపీటీసీ శివకుమార్, క్లస్టర్ కన్వీనర్ కృష్ణమూర్తి, గ్రామ పెద్దల సమక్షంలో నిర్వహించిన హుండీ లెక్కింపు నందు 3 లక్షల29922 రూపాయలు ఆదాయం సమకూరినట్లు వారి పేర్కొన్నారు.

## 30న ఉరవకొండలో విద్యార్థులకు భగవద్గీత పోటీలు

-డిసెంబర్ 1న గీతా జయంతి సందర్భంగా నిర్వహణ

ఉరవకొండ, నవంబరు 25 ప్రభాతవార్త

డిసెంబర్ 1న జరిగే గీతా జయంతిను పురస్కరించుకొని పట్టణంలోని షిరిడిసాయి బాబా కళ్యాణ మండపంలో ఈనెల 30వ తేదీన విద్యార్థులకు భగవద్గీత పోటీలు నిర్వహిస్తున్నామని ఉరవకొండ గీతా పారాయణ సమితి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. 5వ తరగతి, 6 నుంచి 12వ తరగతి, ఆపై చదువులు చదువుకొంటున్న విద్యార్థులుగా మూడు విభాగాలు పోటీలు జరుగుతాయన్నారు. విద్యార్థులు ఏదైనా ఒక శ్లోకం, అర్థం, భావం, ఆచరణ, ఏదైనా ఒక అధ్యాయం, ఆపైన కంఠత చెప్పాలని, గీతా క్విజ్, గీతా కోట్ ఒక చార్ట్‌పై గీతా కొటేషన్ అందంగా రాసి 3 నిమిషాల్లో వివరించాల్సి ఉంటుందని వివరించారు.

వార్త ప్రభావం

## పోలేపల్లి రోడ్డుకు మరమ్మత్తులు చేయించిన కాంట్రాక్టర్



తారు రోడ్డును బాగు చేస్తున్న దృశ్యం

బ్రహ్మసముద్రం నవంబర్ 25 ప్రభాతవార్త

వేపులపర్తి నుండి పోలేపల్లి వరకు తారురోడ్డు వేసిన నెలకే పాడైందని వార్తాపత్రికలో ప్రచురితమైన కథనానికి స్పందించిన కాంట్రాక్టర్ అధికారులు మంగళవారం పోలేపల్లి దగ్గర పాడైన తారురోడ్డును బాగు చేయించిన కాంట్రాక్టర్ అధికారులు.

## స్థానిక సుస్థిర అభివృద్ధిపై సర్పంచులకు, సచివాలయ ఉద్యోగులకు శిక్షణ తరగతులు

అగళి, నవంబర్ 25 ప్రభాతవార్త



శిక్షణనిస్తున్న ఎంపిడిఓ గంగాధర్

గ్రామాల పరిశుభ్రత, పచ్చదనంపై మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఎంపిడిఓ కార్యాలయంలో ఎంపిడిఓ గంగాధర్ ప్రారంభించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను (ఎస్‌డిజిఎస్‌లు) స్థానిక స్థాయికి తీసుకొచ్చి గ్రామాలు, పంచాయితీల అభివృద్ధి ప్రణాళికలో వాటిని అనుసంధానించే ప్రక్రియ 2030 నాటికి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించడానికి గ్రామ పంచాయితీల స్థాయిలో ప్రణాళికలు రూపొందించడం, అమలు చేయడం దీని ముఖ్య ఉద్దేశ్యమని ఎంపిడిఓ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపిపి రేణుకా కామరాజు హాజరయ్యారు. ఈ శిక్షణ తరగతులకు ఏఓరాజేంద్ర ప్రసాద్, ఈఓఆర్డి పద్మ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎమ్మార్సి వెంకటేష్‌బాబు, సర్పంచులు, కార్యదర్శిలు, సచివాలయ ఉద్యోగులు హాజరయ్యారు.

## హిందూ దేవుళ్ళు, దేవాలయాలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేదిలేదు

విశ్వ హిందూ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షులు దేవిరెడ్డిపల్లి రాజేష్

రాయదుర్గం, నవంబర్ 25 ప్రభాతవార్త



మాట్లాడుతున్న రాజేష్

హిందూ దేవుళ్ళు, దేవాలయాలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించబోమని విశ్వ హిందూ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షులు దేవరెడ్డిపల్లి రాజేష్ హెచ్చరించారు మంగళవారం రాయదుర్గంలో ఒకప్రకటనలో పేర్కొంటూ ఇటీవల హైదరాబాద్ లోని ఒక సినిమా టైటిల్ లాంచ్ వేడుకలో ప్రముఖదర్శకుడు ఎస్ఎస్‌రాజమోళి హిందువుల ఆరాధ్యదైవమైన ఆంజనేయస్వామి గురించి అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు అన్నారు . అలాగే టివి యాంకర్ శివ జ్యోతి ఇటీవల తిరుపతి దర్శనానికి వెళ్ళి అక్కడ వెంకటేశ్వర స్వామి వారి లడ్డు ప్రసాదంపై అనుచిత వ్యాఖ్యలు చేయడం పై యావత్ హిందూ సమాజం మండిపడుతోందన్నారు. ఇటీవల హిందూ దేవుళ్ళపై, దేవాలయాలపై కొంతమంది ఉద్దేశ పూర్వకంగా పబ్లిక్ సభలు, సమావేశాలలో, మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేయడం పరిపాటిగా మారిందని, ఇవి హిందువుల మనోభావాలను దెబ్బ తీసేలా వున్నాయని దీనిని విశ్వ హిందూ పరిషత్ తీవ్రంగా పరిగణిస్తుందని ఆయన అన్నారు. సనాతన ధర్మం అయిన హిందూ ధర్మం పై గౌరవం లేకుండా ఉద్దేశపూర్వకంగా ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని, ఇకపై హిందూ సమాజం ఇలాంటివి సహించబోదన్నారు. హిందూ దేవుళ్ళపై, దేవస్థానాలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎస్.ఎస్. రాజమోళి యాంకర్ శివ జ్యోతి వెంటనే హిందూ సమాజానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో వారిని సమాజంలో తిరగకుండా అడ్డుకుంటామని అన్నారు ఈ సమావేశంలో విశ్వ హిందూ పరిషత్ తాలూకా అధ్యక్షులు మద్దిలేటి సత్యనారాయణ, తాలూకా ప్రధాన కార్యదర్శి మాదుగొండే మల్లికార్జున, రాయదుర్గం బజరంగదళ్ సంయోజక్ వగ్గా ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుంది తెదేపా నాయకులు

గుడిబండ నవంబర్ 25 ప్రభాతవార్త



రైతన్న మీకోసం కార్యక్రమంలో పాల్గొన్న దృశ్యం

మండల కేంద్రం లో వ్యవసాయ అధికారి వీరనరేష్, మండల తెలుగు దేశం పార్టీ అధ్యక్షుడు లక్ష్మీనరసప్ప, సింగిల్ విండో అధ్యక్షుడు మద్దనకుంటప్ప ఆధ్వర్యంలో రైతన్న మీకోసం కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పిఎం కిసాన్ పథకం ద్వారా రైతుల కోసం ఏడాదికి 20 వేల రూపాయలు అందిస్తున్న విషయాన్ని రైతులకు వివరించారు.అలాగే కూటమి ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని, రైతుల అభివృద్ధికి నిత్యం కృషి చేస్తోందని తెలిపారు.ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్ చిత్ర శేఖర్,లాయర్ శివకుమార్, జనార్దన్,ముత్తన్న తదితర తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి-వైద్యధికారి డాక్టర్ హరిత

తాడిమర్రి నవంబర్ 25 (ప్రభాతవార్త)



సీజనల్ వ్యాధుల గురించి వివరిస్తున్న వైద్య అధికారులు

మండల పరిధిలోని మరువపల్లి గ్రామం లో వైద్య అధికారులు సందర్శించి సీజనల్ వ్యాధుల పట్ల గ్రామస్తులకు అవగాహన కల్పించారు. మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ జయరాం నాయక్ మాట్లాడుతూ వర్షా కాలంలో దోమలు పుట్టకుండా, కుట్టకుండా చూసుకోవాలని దోమలు పెరిగే ప్రాంతంలో ఏబట్ వేయాలని ఎక్కువ నీరు నిల్వవున్న ప్రదేశాలలో ఆయిల్ బాల్స్ వేయాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని దోమలు బారిన పడకుండా దొమతెరలు వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ రాంకుమార్, హెల్త్ అసిస్టెంట్ హర్షవర్ధన్ రెడ్డి, సి హెచ్ ఓ పావని ఏ ఎన్ ఎం చంద్రావతి, ఆషా వర్కర్లు పాల్గొన్నారు.

## వైభవంగా మహేశ్వరి దేవి కార్తీక దీపోత్సవ వేడుకలు

అమరాపురం నవంబర్ 25 ప్రభాతవార్త



ఘనంగా కార్తీక దీపోత్సవ దృశ్యం

మండల పరిధిలనీ మద్దనకుంట గ్రామంలో వెలసిన మహేశ్వరి దేవి దేవాలయం నందు మంగళవారం కార్తీక దీపోత్సవ వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం నందు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి విశేష పూజలను నిర్వహించారు. తెల్లవారుజామునే అమ్మవారి మూల విగ్రహానికి అభిషేకం మరియు ప్రత్యేక పూలతో అలంకరణ చేసి అమ్మవారి పారాయణన్ని భక్తాతులచే నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని దీపాలను వెలిగించి అమ్మవారికి మొక్కుబడి తీర్చుకున్నారు. కార్తీక దీపోత్సవ వేడుకలను ఆలయ కమిటీ అధ్యక్షుడు యంజారప్ప , ఈరలింగప్ప, వీర క్యాథరాయ, గొల్ల రంగప్ప, హెచ్. దొడ్డయ్య, కరెంట్ అప్ప గారి శివన్న, గడ్డ దుల్లప్ప గారి దొడ్డయ్య, జె .మంజునాథ్, తదితరులు మరియు గ్రామ ప్రజలుపాల్గొన్నారు. విచ్చేసిన భక్తులకు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

## కర్ణాటక ముఖ్యమంత్రిచే మడకశిర ఆణిముత్యం దీపికకు సన్మానం

అమరాపురం నవంబర్ 25 ప్రభాతవార్త



ప్రపంచ కప్ సాధించిన దీపికను సన్మానం దృశ్యం

భారతదేశ మహిళ అందుల ప్రపంచ టి20 వరల్డ్ కప్ ను గెలిచిన టీమిండియా కెప్టెన్ మడకశిర ఆణిముత్యం దీపికను కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధ రామయ్య బెంగళూరు లో ఘనంగా మంగళవారం సన్మానం చేశారు. మడకశిర నియోజకవర్గంలో కర్ణాటక సరిహద్దు గ్రామమైన తంబాలహట్టి లో జన్మించిన దీపిక విద్యాభ్యాసాన్ని సమీప కర్ణాటక రాష్ట్రానికి చెందిన కరే తిమ్మనహళ్లిలో ప్రాథమిక విద్యను అభ్యసించి సిరా, తుముకూరులో చదివినట్లు ఆమె తల్లిదండ్రులు చిక్కతిమ్మప్ప, చిత్తమ్మలు తెలిపారు. కడు పేదరికంతో పుట్టి క్రికెట్లో రాణిస్తూ రాష్ట్ర జాతీయ ప్రపంచ అందల మహిళా క్రికెట్ టీ20పోటీల్లో విజేతగా టీంనుగెలిపించిన మడకశిర ఆణిముత్యము నకు శభాష్‌దీపిక అని కర్ణాటకముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రశంసించారు. ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి హేమావతిలో ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా అందుల టీమిండియా కెప్టెన్ దీపికకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మడకశిర నియోజకవర్గ కర్ణాటక సరిహద్దున ఉన్న తంబాలహట్టి గ్రామంలో జన్మించి ప్రపంచ స్థాయిలో ఖ్యాతి నీ నిలబెట్టిన దీపిక మడకశిర ఆణిముత్యంగా ఆయన అభివర్ణించారు. త్వరలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మరియు మంత్రి లోకేష్ వద్దకు దీపికను తీసుకెళ్లి ప్రభుత్వపరంగా ఆమెకు చేతనందిస్తామని ఆయన తెలిపారు. నిరుపేద కుటుంబంలో పుట్టి క్రికెట్లో తన సత్తా చాటిన దీపిక తల్లిదండ్రులు అదృష్టవంతులు అన్నారు.

## ఎంపీడీవో కార్యాలయాన్ని తనిఖీ చేసిన డిపిఓ

కంబదూరు, నవంబర్ 25, ప్రభాతవార్త



రికార్డులు పరిశీలిస్తున్న డిపిఓ నాగరాజు నాయుడు

మండల కేంద్రం లోని ఎంపీడీవో కార్యాలయాన్ని అనంతపురం జిల్లా పంచాయతీ అధికారి నాగరాజు నాయుడు మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పలు రికార్డులను పరిశీలించారు. సిబ్బంది హాజరు, అభివృద్ధి పనుల పురోగతి, నిధుల వినియోగంపై ఎంపీడీవో సూర్యనారాయణను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ప్రజలకు అందే సేవల విషయంలో త్వరితగతిన చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ పంచాయతీల్లో పారిశుధ్య పనులు సక్రమంగా జరిగేలా చూడాలని పంచాయతీ కార్యదర్శి లకు సూచించారు. అనంతరం ఆయన వడ్డే కాలనీలో జరుగుతున్న భూగర్భ డ్రైనేజీ పనులను పరిశీలించి, త్వరగా పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. డిపిఓ వెంట ఈఓఆర్డి లీలావతి, పంచాయతీ కార్యదర్శి అశ్వర్థ రెడ్డి, కంబదూరు సర్పంచ్ పద్మవతమ్మ తనయుడు గంగాధర ఉన్నారు.

## కలేకుర్తిలో కోటి సంతకాలు సేకరణ

కనేకల్ నవంబర్ 25 ప్రభాతవార్త



కోటి సంతకాల సేకరణ చేస్తున్న జయరామిరెడ్డి

కనేకల్ మండల పరిధిలోని కలేకుర్తి గ్రామం నందు రాయదుర్గం నియోజకవర్గం వైఎస్ఆర్సిపి సమన్వయకర్త మెట్టు గోవింద రెడ్డి ఆదేశాల మేరకు రచ్చబండ మరియు కోటి సంతకాలు కార్యక్రమం మంగళవారం నిర్వహించారు.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఉషారాణి మరియు కన్వీనర్ పాటిల్ బ్రహ్మానందరెడ్డి ఆధ్వర్యంలో ప్రతి ఒక్కరు నుండి సంతకల సేకరణ నిర్వహించారు రచ్చబండ కార్యక్రమంలో మెడికల్ కాలేజీలు ప్రైవేటుపరం కాకుండా ఆపడానికి కోటి సంతకాలు నిర్వహిస్తున్నట్లు ప్రజలకు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఏ వన్ కాంట్రాక్టర్ జయరాం రెడ్డి కలేకుర్తి సర్పంచ్ భాస్కర్ రెడ్డి వైసిపి నాయకులు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు

## ప్రమాద బాధితున్ని పరామర్శించిన టిడిపి నేతలు

లేపాక్షి, నవంబర్ 25 ప్రభాతవార్త



బాధితున్ని పరామర్శిస్తున్న టిడిపి నేతలు

మండల పరిధి లోని గలిగిపల్లి గ్రామంలో ఇటీవల ప్రమాదానికి గురైన టిడిపి కార్యకర్త జెబీవుల్లాను మంగళవారం టిడిపి నేతలు పరామర్శించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పుట్టపర్తి పర్యటన సందర్భంగా గలిబిపల్లికి చెందిన టిడిపి కార్యకర్త జెబీవుల్లా రోడ్డు ప్రమాదానికి గురై తీవ్ర గాయాలతో చికిత్స పొంది విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో మంగళవారం ఎమ్మెల్యే పిఏ శ్రీనివాసరావు, మండల కన్వీనర్ అభిలాష్, మాజీ ఎంపిపి ఆనంద్‌కుమార్, గలిబిపల్లి శివశంకర్, తదితరులు ప్రమాద బాధితుని ఇంటికి వెళ్లి పరామర్శించారు. పార్టీపరంగా సహాయం అందజేస్తామని వారు బాధితునికి తెలియచేశారు.

## ఆటోలోంచి కిందపడి వ్యక్తికి తీవ్ర గాయాలు

పరిస్థితి విషమం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలింపు

ఉరవకొండ, నవంబరు 25 ప్రభాతవార్త



తీవ్రంగా గాయపడిన ట్రాక్టర్ మెకానిక్ ఆసిఫ్

ఉరవకొండ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోగల లాడ్జి వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో విడపనకల్లు మండలం వేల్పుమడుగు గ్రామానికి చెందిన ట్రాక్టర్ మెకానిక్ ఆసిఫ్ తీవ్రంగా గాయపడ్డాడు. ఉరవకొండలో ట్రాక్టర్ మెకానిక్ గా జీవనం సాగిస్తున్న ఆసిఫ్ పని ముగించుకుని ఆటోలో స్వగ్రామానికి బయలుదేరగా పొలానికి మందు కొట్టి వస్తున్న చిన్న ట్రాక్టర్ వెనుక వైపు నుండి ఆటోనుఢీకొంది. దీంతో ఆటోలో డ్రైవర్‌పక్కన కూర్చుని ప్రయాణిస్తున్న ఆసిఫ్ ఒక్కసారిగా కిందపడి తలకు బలమైన గాయాలయ్యాయి. దీంతో స్థానికులు ఆయన్ను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం అతని పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు 108 అంబులెన్స్ లో జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. పోలీసులు ఘటనపై విచారణ చేపట్టారు.

## ఇంటిలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీ

బెలుగుప్ప, నవంబర్ 25 ప్రభాతవార్త



బీరువా పగలగొట్టిన దృశ్యం

మండల పరిధిలో ఎలగలవంక తాండలో సోమవారం అర్ధరాత్రి 12గంటలపైన గోపాల్‌నాయక్ ఇంటిలో తాళాలు పగలగొట్టి బీరువా తాళాలు పగలగొట్టి లక్ష రూపాయలు, 15తులాల వెండిని గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారని, బెలుగుప్ప పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ట్రైనింగ్ ఎస్ఐ జి.మహేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని తెలిపారు. గోపాల్‌నాయక్ మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజన్‌లో మొక్కజొన్న పంటకు వచ్చిన రూ.లక్ష బీరువాలో దాచిపెట్టానని, వెంటనే ఈ కేసును పరిష్కరించి మాకు న్యాయం చేయాలని కోరారు.

## అభివృద్ధి చూసి ఓర్వలేక బురద జల్లే ప్రయత్నం మానుకోండి కన్వీనర్ శ్రీరాములు

- స్వంత నిధులు ఖర్చు చేసి అభివృద్ధి చేస్తున్న ఎమ్మెల్యేపై అవాకులు చవాకులు పేలడం మానుకోండి
- బి యస్ యన్ ఎల్ అడ్వైసరీ కమిటీ మెంబర్ రామ్మోహన్
- ఇచ్చిన మాటకు కట్టుబడి బీటీపీ కాలువ శరవేగంగా చేపడుతున్నారు జడ్పీటీసీ ప్రభావతి



సమావేశంలో మాట్లాడుతున్న మండల కన్వీనర్

బ్రహ్మసముద్రం నవంబర్ 25 ప్రభాతవార్త

గ్రూప్ వన్ అధికారిగా పనిచేసి కనీస మర్యాద లేకుండా ఏకవచనంతో వ్యంగ్యంగా మీరు, మీ నాయకులు మాట్లాడటం ముందుగా మానుకుని హుందాతనంగా వ్యవహారించాలని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పాలబండ్ల శ్రీరాములు అన్నారు బ్రహ్మసముద్రం మండల కేంద్రం నందు కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు, జడ్పీటీసీ ప్రభావతి, బి ఎస్ యన్ ఎల్ అడ్వైసరీ కమిటీ మెంబర్ అమరా రామ్మోహన్‌చౌదరి, జడ్పీటీసీ ప్రభావతి, మాజీ జడ్పీటీసీ వెంకటేషులు, టీడీపీ మండల నాయకులతో కలసి మీడియాసమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మండలపార్టీఅధ్యక్షులు శ్రీరాములు మాట్లాడుతూ 2019 నుంచి 2024 వరకు ఎమ్మెల్యే, మంత్రిగా ఉషాశ్రీ చరణ్‌కు, ఎంపీగా ఉన్న మీకు పడక కళ్యాణదుర్గం వైపు కన్నెత్తి చూడని రంగయ్య నేడు విమర్శలు చేయడం మంచి పద్ధతి కాదన్నారు.రంగయ్య భైరసముద్రం చెరువు దగ్గరకు వచ్చి బీటీపీ నీళ్ల వదలాలి చెరువుకు నీళ్ల రాలేదు అంటూ వ్యంగ్యంగా మాట్లాడటం జరిగింది. కానీ మా ఎమ్మెల్యే ఎక్కడో తెలంగాణాలో ఉన్న హిటాచి తెప్పించి కాలువ పనులు చేయించి నీటిని వదిలారు మరో నాలుగు రోజుల్లో చెరువు నిండి మరువ కూడా పారబోతుంది.గతంలో ఐదేళ్ల ఎమ్మెల్యే ఉషాశ్రీ, ఎంపీగా మీరు ఉండి ఏనాడు చెరువులు కానీ, బ్రహ్మసముద్రం మండలం కానీ గుర్తుకు రాలేదు కదా అభివృద్ధి అంటే మీకు తెలియదు అభివృద్ధి అంటే ఏమిటి మా యం ఎల్ ఏ సురేంద్ర బాబు చూసి నేర్చుకో వేపులపర్తి వద్ద రోడ్డు తెగిపోతే గతంలో నాలుగు నెలలు అయిన పట్టించుకోలేదు మేము మా ఎమ్మెల్యేకి చెప్పిన వారంలోగా పనులు పూర్తి చేశాం. అనేక అభివృద్ధి పనులు చేస్తుంటే రంగయ్య చదువుకున్న వ్యక్తి అయివుండి కూడా పద్ధతి తప్పి మాట్లాడటం, ఏకవచనంతో సంభోదించడం సరికాదన్నారు. 20192024 మధ్య ఉషాశ్రీ పోలేపల్లి నుంచి భైరవానితిప్పకు శంకుస్థాపన చేస్తే నేటికి అలాగే ఉంది కాని మొన్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు వేపలపర్తి నుంచి పోలేపల్లి వరకు రోడ్డు వేయిస్తే అక్కడ శిలాపలకాన్ని ధ్వంశం చేశారు అంటే ఎంత దారుణం. అలాగే కళ్యాణదుర్గం నుంచి కన్నెపల్లి వరకు 18 కోట్ల రూపాయలతో తారు రోడ్డు, ఎరడికేర నుంచి యర్రప్పదొడ్డికి, ఎరడికేర నుంచి మామడూరు వరకు, కన్నెపల్లి నుంచి ముద్దలాపురం వరకు, పాలవేంకటాపురం నుంచి జింకలదొడ్డి వరకు రోడ్లు మంజూరయ్యాయన్నారు. ఇక ఇసుక, మట్టి అమ్ముకుంటున్నారని మాట్లాడే మీరు మీ నాయకులు గత ఐదేళ్లు ఎవరు ఇసుక అమ్ముకున్నారో చెప్పాలి. వేపలపర్తి రంగనాథ స్వామి సన్నిధిలో డేట్ మీరు చెప్పండి మేము అందరం వచ్చి ప్రమాణం చేస్తాం.మీరు చేస్తారా లేక మీరు ఆత్మపరిశీలన చేసుకుంటారా అన్నారు.రామ్మోహన్ మాట్లాడుతూ ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు గెలిచిన నాటి నుంచి ప్రజల సంక్షేమం కోసం తన స్వంత నిధులతో అభివృద్ధి చేస్తున్నారని, పాలవాయి పాఠశాలను నాడు నేడు పేరుతో అర్ధాంతరంగా ఆపేస్తే ఎమ్మెల్యే 50 లక్షలతో పూర్తి చేస్తున్నారని, శెట్టూరు ఉన్నత పాఠశాలకు డెస్కులు, కదిరిదేవరపల్లి గ్రామంలో కళ్యాణమటపం ఉచిత డీఎస్సీ కోచింగ్ సెంటర్, మహిళలకు కుట్టు శిక్షణ, కేపీఎల్ క్రికెట్, అనేక గ్రామాల్లో వాల్మీకి, కనకదాసు విగ్రహాల ఏర్పాటు ఎన్నో చేస్తున్నారని దాంతో వారికి మంచి పేరు వస్తుందనే ఇలాంటి లేని పోనీ అసత్య ఆరోపణలు, విమర్శలను రంగయ్య చేస్తున్నారన్నారు. కళ్యాణదుర్గంలో బ్రిడ్జిని పోలవరంతో పోల్చారు అవును చేసే పనిలో నిబద్ధత ఉంది కాబట్టే సుందరంగా బ్రిడ్జి, రోడ్డు వేయించారని అన్నారు. నీలాగా ఐదేళ్ల ఎంపీగా ఉండి ఉషా శ్రీ చరణ్ కు భయపడి కళ్యాణదుర్గం వైపు కన్నెత్తి చూడలేదు అలాంటి నీవు కళ్యాణదుర్గం అభివృద్ధి గురించి మాట్లాడటం సిగ్గుచేటు.జడ్పీటీసీ పద్మావతి మాట్లాడుతూ గతంలో మంత్రి ఉషాశ్రీ బీటీపీ కాలువ పూర్తి చేస్తాను అని చెప్పి దాన్ని విస్మరించిందని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు మాత్రం ఇచ్చిన మాట ప్రకారం కాలువ పనులను ప్రారంభించి పనులు వేగం కోసం పెద్ద పెద్ద వాహనాలను తెప్పించి శరవేగంగా పనులు జరిగేలా చేస్తుంటే రంగయ్య చూడలేక విమర్శలు చేస్తున్నారని అన్నారు.

